34

# మానవుడు మారినప్పుడే ప్రపంచము మారుతుంది

**ప్రేమస్వరూపులారా!**

మానవుని దివ్యజీవితము తనగుణములపైననే ఆధారపడి ఉన్నది. మానవుని పరిణామము విశ్వపరిణామముగా భావించాలి. మానవుడు మారినప్పుడే ప్రపంచము మారుతుంది. వ్యక్తి మంచివాడైనప్పుడే సమాజముకూడా మంచిదిగా రూపొందుతుంది.

సమాజముయొక్క బయట పరిస్థితులను మాత్రమే మనము ఆధారముగా తీసుకుంటున్నాము. రాజకీయముగా, ఆర్థికముగా, సామాజికముగా, భౌతికముగా కూడా మనము బాహ్య పరిస్థితుల ప్రభావాన్ని అనుసరిస్తూ వస్తున్నాము. ఈ పరిణామములు మాత్రమే చాలవు. మానసిక పరిణామము, ఆధ్యాత్మిక పరిణామము అత్యవసరము.

**వ్యక్తియొక్క క్రియాశీలత గుణములపైననే ఆధారపడి యుంటున్నది**

మానవుడు యీనాడు ఆశించవలసినది దీర్ఘజీవితము కాదు, దివ్యజీవితాన్ని ఆశించాలి. పొడిగించుకొనవలసినది జీవితముకాదు, గుణాన్ని పొడిగించుకోవాలి. పొడిగించుకొను జీవితము కాలాధీనము, బలపరచుకోవలసినది గుణము. కనుక వ్యక్తియొక్క క్రియాశీలత అంతా గుణములపైననే ఆధారపడి ఉంటున్నది. ఈ సత్యాన్ని మరచి, బాహ్య సంబంధమైన పరిణామములను, పరివర్తనలను ఆశిస్తున్నాము. లోకమునకు దిక్కెవరని యక్షుడు ప్రశ్నించగా 'సజ్జనుడే యీ లోకమునకు దిక్కు', అని ధర్మజుడు చెప్పాడు. సజ్జనులైన గుణవంతులే యీ లోకమున లేకుండిన ప్రపంచము దిక్కుమాలిన ప్రపంచముగా రూపొందుతుంది. కనుక, ఈనాడు గురువులకంటె శిష్యులు ఉత్తమోత్తములుగా ఉండాలి. కానీ, యీనాటి శిష్యులు గురువులు యీ విధముగా ప్రవర్తించటము లేదు. ఈనాటి శిష్యులయందు స్వార్థము,

srisathyasaivachanamrutam

స్వప్రయోజనము నిండి ఉంటున్నాయి. దీనికి అనుగుణముగానే గురువులయందు స్వార్థ, స్వప్రయోజనములు తాండవమాడుచున్నవి. కేవలము తమ అభీష్టములు నెరవేర్చుకొనే నిమిత్తమై శిష్యులు, గురువులను ఆశ్రయిస్తున్నారు. తమ అభీష్టములు నెరవేరిన సంతృప్తి చెందుతున్నారు. నెరవేరకపోయిన దీనికి విరుద్ధమైన పరిణామములు పొందుతున్నారు. గురువులయందు విశ్వాస రాహిత్య తీర్మానానికి సిద్ధమవుతున్నారు. ఈ విధముగా గురుశిష్యులయందు సన్నిహిత సంబంధమనేది అభివృద్ధి కావటంలేదు. ముఖ్యముగా ఈనాటి శిష్యులు తమ అభివృద్ధిని మాత్రమే ఆశించి మానసిక సంబంధమైన పరిణామములకు యే మాత్రము లక్ష్యము చేయక కేవలము భౌతికమైన మార్పులను మాత్రమే ఆశిస్తున్నారు.

వైరాగ్యమనేది కేవలము ఒకరి ఉపదేశములవలనగాని, ఒకరి ప్రోద్బలమువలనగానీ వచ్చేది కాదు. ఎన్ని ఉపన్యాసములు విన్నప్పటికిని, ఎన్ని గ్రంథములు చదివినప్పటికిని, ఎన్ని ప్రబోధలు చేసినప్పటికిని అది లోపలనుండి ఆవిర్భవించవలసినదేగాని బయటనుండి వచ్చునది కాదు. శుద్ధోదనుడు తన కుమారుడైన బుద్ధునకు వైరాగ్యము రాకుండా ఉండే నిమిత్తమై ఎన్నో కట్టుబాట్లు చేయించాడు. కానీ వైరాగ్యము రాక తప్పలేదు.

**రాకన్ మానవు హాని వృద్ధులు మహారణ్యంబునన్ దాగినన్**
**పోకన్ మానదు దేహమెవ్విధమున పోషించి రక్షించినన్**

బుద్ధునకు వైరాగ్యము రాకుండుటకు యెన్ని విధముల ప్రయత్నించినప్పటికిని, చివరకు వైరాగ్యము రావటము, యిల్లు వీడటము, సర్వసంగ పరిత్యాగి కావటము జరిగింది.

**మానవ జీవితము అన్నమయమైనది కాదు, ఆత్మమయమైనది**

విద్యార్థులారా! మన జీవితము అన్నమయమైన జీవితము కాదు. ఆత్మమయమైన జీవితము మనది. అన్నమయమైనదే జీవితమని భావించువాడు అజ్ఞాని. ఆత్మమయమైన జీవితమే జీవితమని భావించువాడు విజ్ఞాని. రంతిదేవుడు చెప్పాడు, 'స్వామీ! కేవలము అన్నమయ జీవితాన్ని ఆశించువాడు పాపి. ఆత్మమయ జీవితాన్ని ఆశించువాడు గోపి' అని. కృష్ణచైతన్య పూరీజగన్నాథునివద్దకు వెళ్లాడు. అతను చక్కనియువకుడు. జగన్నాథునితో యీవిధముగా అన్నాడు. 'జగన్నాథా! నీవు కేవలము జగన్నాథుడవేకాదు. విశ్వనాథుడవు. ప్రాణనాథుడవు.

srisathyasaivachanamrutam

జీవనాథుడవు. యీ దేహనాథుడవు. జగత్తునకే నాథుడవు. నీవు యేమైనా చేయగలవు. నేను యోగబలమును ఆశించను. కండబలము నాకవసరము లేదు. ఆత్మబలము నాకవసరము లేదు. నీయొక్క ప్రేమబలమే నాకు నిజమైన బలమ'న్నాడు. 'ప్రేమబలమే నిజమైన బలము. సర్వబలములు దుర్బలములు', అన్నాడు. కనుక భగవంతునివద్దనుండి కోరవలసినది ప్రేమ బలము ఒక్కటి మాత్రమే! ప్రేమబలము ఒక్కటుంటే సర్వబలములు చేకూరుతాయి. కోరవలసినది సిరికాదు. హరిని కోరాలి. మనము ఆశించవలసినది లక్ష్మిని కాదు, లక్ష్మీపతిని. ధనమును రాసులుగా పోసుకున్నవాడు కాదు, మహారాజు. సర్వసంగపరిత్యాగియే మహారాజు. ఉత్తర భారతదేశములో సాధువులను, సన్యాసులను చూచినప్పుడు 'మహరాజ్! మహారాజ్!' అని సంబోధిస్తూ ఉంటారు. సర్వసంగ పరిత్యాగులే మహారాజులని వారి ఉద్దేశ్యము. సిరిసంపదలతో తులతూగటము కాదు, నిజమైన భోగము. దైవప్రేమతో, దైవచింతనతో కాలము గడపటమే నిజమైన యోగము.

### భగవంతుడు త్రిలోకములందు, త్రికాలములందు ఉంటున్నాడు

బ్యాంక్ క్యాషియర్‌దగ్గర చాలా డబ్బు ఉంటుంది. కట్టల కట్టల నోట్లు అతని స్వాధీనములో ఉంటాయి. కాని, అది తన డబ్బుకాదు. అదే విధముగ యిచ్చుకొన్నది మనది గాని, పుచ్చుకొన్నది మనది కాదు. 'త్యాగేనైకే అమృతత్వమానసుః.' త్యాగమునందే నిజమైన అమృతత్వము మనకు కనబడుతుంది. కనుక, చైతన్యుడు ద్వాదశాక్షర మంత్రమే తనకు నిజమైన ప్రాణమని 'నా-కు-ది-క్కు-భ-గ-వం-తు-డు -ఒ-క్కడే!' అన్నాడు. ఇది పన్నెండు అక్షరముల ద్వాదశాక్షర మంత్రము. అతనే నా హృదయవాసి. ఎందుకనగా 'మమాత్మా సర్వభూతాంతరాత్మ' అన్నాడు. నా ఆత్మయే సర్వభూతములందు ఆత్మస్వరూపముగా ఉంటున్నది. అతనే హృదయేశుడు. ఇతనే పురుషోత్తముడు. కేవలము నఖశిఖ పర్యంతము దేహమందు సంచరించువాడే పురుషోత్తముడు. పురమనగా దేహము. దేహమనే పురమును సర్వవిధములుగా రక్షిస్తూ, పోషిస్తూ, అన్నివిధములా దానిని సంరక్షిస్తూ వస్తున్నాడు. అయితే యీ పురుషోత్తముడు దేహమునందు మాత్రమే, ఈ మూడున్నర మూరలున్న దేహమునందు మాత్రమే ఉన్నాడని భావించరాదు. భగవంతుడు త్రిలోకములందు ఉంటున్నాడు. త్రికాలములందు ఉంటున్నాడు.

srisathyasaivechamrutam

ఈ విధమైన దైవత్వాన్ని మనము హృదయ స్థాయియందు స్థాపించుకోటానికి ప్రయత్నించాలి.

**మానవజన్మ ఆదర్శమును నిరూపించే నిమిత్తమై వచ్చింది**

మనము యీనాడు కర్మలద్వారా అనేక సంపదలను ఆర్జిస్తున్నాము. కర్మలే అస్థిరమైనప్పుడు కర్మఫలమైన సంపద స్థిరముగా ఎట్లు ఉంటుంది? అవన్నియు కూడా అనిత్యములే, అసత్యములే! అని చెప్పింది భగవద్గీత. నిత్యసత్యమైన దైవము ఒక్కడే! ఇలాంటి దివ్యత్వాన్ని మనము ఈనాడు విస్మరిస్తున్నాము. మనయొక్క మానసిక తత్త్వము నమ్మినట్లుగా, ఆరాధన చేసినట్లుగా, విశ్వసించినట్లుగా మనము భావిస్తున్నాము. 'యద్భావం తద్భవతి' అన్నట్లుగా మన భావములను పురస్కరించుకొని మనము ఫలితములను అందుకోగలుగుతున్నాము. మనము బాహ్యరూపముగా అనేక విధములుగా చెప్పవచ్చు. కొన్ని ప్రదర్శించవచ్చు. కానీ భగవంతునకు నీ భావాన్ని మూసిపెట్టటం సాధ్యము కాదు. నేను పరమభక్తుడనని చెప్పవచ్చును. అన్నివిధముల భగవంతుని సంతృప్తి పరచేకోసము కావలసినన్ని మాటలాడవచ్చును. కాని మన మనసుకు మనము, మన conscience కు మనము తృప్తిగా ఉంటున్నదా అని విచారించాలి. అన్నమాచార్యులు యిదే విధముగా భగవంతుని ప్రార్థించి నీవే నా సర్వస్వమని అనేక పాటలు వ్రాసాడు. కట్టకడపటికి తన యథార్థమును గుర్తించుకున్నాడు. మాటలతో భగవంతుని మోసగిస్తున్నానని ఒక్కతూరి పరిణామము చెందాడు. మన గ్రంథములచేతను, మన మాటలచేతను భగవంతుని సంతృప్తిపరచలేము. మన చదువులచేతను, మన పాండిత్యముచేతను, మన యుక్తులచేతను, మన ధీశక్తిచేతను భగవంతుని సంతృప్తి పరచటము సాధ్యము కాదు. 'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు' అని అన్నమాచార్యుడు అన్నాడు. ఓ భగవంతుడా ఏ భావముతో ఎవరు తలుస్తున్నారో అంతమాత్రమే నీవు ఉంటున్నావు. అంతకు మీరిపోవు. మనము ఎంతపాత్ర తీసుకొని సముద్రములో ముంచుతామో అంతనీరే ఆపాత్రలో ప్రవేశిస్తుంది.

**చిన్న చెంబులో ముంచినగాని**
**ఎన్ని సముద్రముల్ నించినగాని**
**కడవెంతో నీరంతేరా**

sri sathyasai vachanamrutam

**కావాలన్నను ఎక్కువ రాదురా**
**కర్మదాటవశమా! నరుడా! కర్మదాట వశమా!**
**ఘనపాఠంబులు చదివినగాని**
**కులదేవతలను కొలచినగాని**
**కారడవులకే పోయినగాని**
**కఠిన తపస్సులు చేసినగాని**
**కర్మదాట వశమా! నరుడా! కర్మదాట వశమా!**

మనక్రియలు పవిత్రమైనవిగా ఉంటుండాలి. వానివలన మనము కావలసినంత ఫలితాన్ని పొందగలము. ఎట్టి పిండో అట్టి రొట్టె. ఎట్టి తిండో అట్టి త్రేపు. అదేవిధముగనే మనము మంచి కర్మలలో ప్రవేశించాలి. ఆదర్శాన్ని నిరూపించే నిమిత్తమై ఆవిర్భవించినది మానవజన్మ అనే సత్యాన్ని నిరూపించాలి.

**భక్తితో భగవంతుని తలచుచు నిత్యధర్మములు నిర్వర్తించడమే రాజయోగము**

ప్రేమ స్వరూపులారా! మానవజీవితము ఉత్కృష్టమైనది. సౌజన్యమైనటువంటిది. పవిత్రమైనది. సార్థకమైనది. ఈనాడే మనము తరించకపోతే యేనాడు మనము తరించగలము? తలనిండుకు తలంపులను నింపుకొని దైవమును ప్రార్థించి, అనుగ్రహముతో నింపమంటే ఏవిధముగా నింపగలడు?

**ఏమిలేని బుఱ్ఱలోన ఏమైనను చేర్చవచ్చు**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱనింప వీలగునా**
**తలబుఱ్ఱది ఖాళీగాక యిల సుకృతము నింపనగునా?**

కనుక, మొట్టమొదట అనవసరమైన తలంపులను నిర్మూలము గావించాలి. తలను ఖాళీ చేయాలి. అప్పుడే సుకృతము దానిలో నింపటానికి వీలవుతుంది. నేను మానవుడనని ఆకారాన్ని చూచి అహంకారపడుతున్నారు. కానీ, ఆకారములో మానవులమేగాని ఆచారములో మానవత్వము లేదని మనము గుర్తించుకోవాలి. ఆకారము ఉండినంతమాత్రమున మానవుడని చెప్పుటకు వీలులేదు.

srisathyasaivachanamrutam

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా?**
**పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?**
**పులి చర్మము గప్పినట్టి గాడిద తాపులియగునా?**
**ఏనుగంత బలిసి ఉన్న పంది యేనుగగునటయ్యా!**

కనుక, ఆకారాన్ని మాత్రమే మనము దృష్టియందు ఉంచుకొనరాదు. మనయొక్క మానవ ధర్మాన్ని మనము చాటటానికి ప్రయత్నించాలి. మానవత్వాన్ని మనము నిరూపించాలి. మన హ్యూమన్ క్వాలిటీస్‌ను మనము సరియైన మార్గములో ప్రవేశపెట్టాలి. మానవత్వముయొక్క సత్యాన్ని మనము ప్రవర్తనలో నిరూపించాలి. ఇలాంటి దివ్యమైన అవకాశము లభించినందుకు మనము కాలమును వ్యర్థము చేయరాదు. ఇలాంటి అవకాశమును లోక సంబంధమైన విద్యలతోపాటు దైవ చింతనకూడా చేసి అంతర్ముఖమైన ఆనందమును పొందటానికి తగిన ప్రయత్నము చేయాలి.

**జగతిని జీవించువాడు మనుజుడు కావలె మొదట**
**ఆత్మవిద్య నేర్చి యిచట ఆధ్యాత్మను కనుగొనుట**
**రాజయోగమునకు బాట యిదియె స్మృతులు చెప్పు మాట**

మనము రాజయోగులము. రాజయోగులమనగా కర్తవ్య కర్మల నాచరిస్తూ, దాని ఫలనిమిత్తము యోచించకుండా లోకక్షేమాన్ని, సమాజముయొక్క అభివృద్ధిని మనము ఆదర్శ ప్రాయముగా నిరూపించాలి. అదియే జనక మహారాజు చేసిన తపస్సు.

**భక్తితోడ భగవంతుని తలచుచు**
**నిత్యధర్మములు నిర్వర్తించిన**
**అట్టి జనకునకు రాజయోగమున**
**అందరాని మోక్షంబు అందెనే.**

భక్తితోడ భగవంతుని తలచుచు, నిత్యధర్మములు నిర్వర్తించుచున్న అదే రాజయోగము అని జనకుడు నిరూపించాడు. నీకర్తవ్యమైన విద్యలు నేర్చుచు, బాహ్యసంబంధమైన జీవితములో నీ ఆదర్శములను నిరూపిస్తూ, అంతర్ముఖమైన ఆత్మానందమును అనుభవిస్తూ రావాలి. అదియే విద్యార్థులయొక్క ప్రథమ కర్తవ్యము.

sri sathyasai vahamrutam

### మానవ పరిణామమే విశ్వ పరిణామము

మానవపరిణామమే విశ్వపరిణామము. మానవుడు పరిణామము చెందితే దేశమంతా పరిణామము చెందుతుంది. కానీ, ఈనాటి మానవుడు 'తిండికి తయార్, పనికి పరార్'గా ఉంటున్నాడు. కార్యాచరణను చేసేవారిని గమనించి అన్నమే వారిని వెతుక్కుంటూ వస్తుంది. పనిచేయని సోమరిపోతు అన్నాన్ని వెతుక్కుంటూ పోతాడు. అన్నాన్ని వెతుకుతూ పోయేవాడు సోమరి. ఎవరినైతే అన్నం వెతుక్కుంటూ వస్తుందో వాడే కర్మజీవి. కర్మాచరణచేత మనకు ఏమాత్రము లోపం కలుగదు. తిండి నిమిత్తమై మనము యేమాత్రము ప్రాకులాడనక్కరలేదు. చింతించనక్కరలేదు. రెండు చేతుల నిచ్చాడు. ఒక్కపొట్ట. చేతుల నిండుగా పనిచేస్తే పొట్ట నిండదా? మనము రెండు చేతులకు రెస్టు యిస్తున్నాము. మనము కర్మ జీవులము కావాలి. అదే మన అధికారము. ఈ కర్మ తత్త్వాన్ని మనము చక్కగా గుర్తించుకున్నప్పుడు, మన ధర్మాన్ని మనం చక్కగా ఆచరించటానికి వీలుంటుంది.

### జగత్తంతా విష్ణుస్వరూపంగా మనం గుర్తించాలి

అదియే బ్రహ్మసూత్రములో మొదటి సూత్రము. 'అథాతో బ్రహ్మ జిజ్ఞాస.' 'అథః, అంతః , బ్రహ్మ, జిజ్ఞాస' అన్నారు. ఈ నాలుగు పదముల తత్త్వము జీవతత్త్వములో యిమిడి ఉంటున్నది. కనుక, మనము యీనాడు సృష్టినంతనూ విలక్షణముగా చూడాలి. మన చరిత్ర సలక్షణం కావాలి. మన దేహతత్త్వము అలక్షణం కావాలి. ఒకటి విలక్షణం. రెండవది సలక్షణము. మూడవది అలక్షణము, సృష్టి విలక్షణము, ఇదంతా భగవంతుని స్వరూపమని గుర్తించాలి. అదే 'విశ్వం విష్ణు స్వరూపం'. జగత్తంతా విష్ణు స్వరూపంగా మనం గుర్తించాలి. మన చరిత్ర సలక్షణము. మన చరిత్ర యెవ్వరూ వేలెత్తి చూపించకుండా దోషరహితముగా, తెల్లగా వైట్‌పేపరువలె ఉండాలి. తెల్లటి గోడపైన చిన్న మచ్చవేసినా అది కనిపిస్తుంది. అదేవిధముగా మన హృదయము సలక్షణమైన హృదయముగా ఉంచుకుంటే దేహము అలక్షణం అవుతుంది. అప్పుడే దేహభ్రాంతులతో కూడిన కోరికలతో మనము మునిగిపోము. దేహము అత్యవసరమే! అది ఒక పనిముట్టు. ఈ పనిముట్టుద్వారానే మనము పవిత్రమైన స్థానాన్ని చేరాలి. ఆరోగ్యమును, దానికి తగిన అనుకూలములను మనము తప్పక చూడవలసిందే! అయితే లక్ష్యము దేనిపైన?

srisathyasaivachanamrutam

విలక్షణముపైన లక్ష్యము ఉంటుండాలి. అట్లు లేకుండా విలక్షణమును అలక్షణముగా చేసుకొని, సలక్షణమును అవలక్షణముగా తీసుకొని మనము మాత్రము లక్షణంగా ఉండాలంటే అది సాధ్యమయ్యేపనా! ఇలాంటి జీవితము యెలాగుంటుందంటే చక్రాలు లేని రథము. నీరు, ఎరువు లేని పంట, సింధూరం లేని వనిత, గుణములేని మానవత్వము' వలె ఉంటుంది. యిది వ్యర్థము అన్నారు.

**కర్మమునుండి ధర్మము, ధర్మమునుండి బ్రహ్మము రావాలి**

ఈనాడు మనకు బ్రహ్మజిజ్ఞాస యేవిధముగా కలుగుతుంది? ధర్మ జిజ్ఞాసలో కొంతకాలము ఆరితేరినప్పుడు బ్రహ్మ జిజ్ఞాస మనకు లభిస్తుంది. మనకు ధర్మ జిజ్ఞాస ఎప్పుడు లభిస్తుంది? మనము కర్మ జిజ్ఞాసలో ఎప్పుడు పరిపూర్ణులము అవుతామో అప్పుడే ధర్మజిజ్ఞాస లభిస్తుంది. అందువలన 'అథాతో కర్మ జిజ్ఞాస', 'అథాతో ధర్మజిజ్ఞాస', 'అథాతో బ్రహ్మ జిజ్ఞాస' అన్నారు. అనగా కర్మమునుండి ధర్మము, ధర్మమునుండి బ్రహ్మము రావాలి. కర్మలయందు, ధర్మములయందు పరిపూర్ణ విశ్వాసము కలిగి ఉండాలి. ఈ ధర్మమును అనుసరించుటకు తగిన మనోవాక్కాయ కర్మలను మనము పోషించుకోవాలి. ఈ ధర్మమే మన జన్మకు సరియైన గమ్యము. అందువలనే భగవంతుడు ధర్మస్వరూపుడు. 'రామో విగ్రహ వాన్ ధర్మః' అన్నారు.

భగవంతుడు ప్రేమ స్వరూపుడు. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. కనుక మనము యీ ప్రేమ, ధర్మములందు పరిపూర్ణమైన విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. ఈ ధర్మము నాచరించవలసిన విద్యార్థులుగా మీరు ఉంటున్నారు. విద్యార్థులు గట్టిగా పాటించవలసిన ధర్మాలు ఉంటున్నాయి. ఇది పవిత్రమైన వయస్సు. ఈ వయస్సును మనము చెడగొట్టుకుంటే జీవితమంతా చెడగొట్టిన వారమవుతాము. మొదలు చక్కగా ఉంటే చెట్టంతా చక్కగా ఉంటుంది. మొదలు సొట్టబోతే చెట్టంతా సొట్టబోతుంది. కనుక యీ పవిత్రమైన వయస్సునందు యెట్టి దుర్భావములకుగాని, ఎట్టి దుశ్చింతలకుగాని సాధ్యమైనంతవరకు అవకాశము యివ్వకుండా చూచుకోవాలి. అయితే కొన్ని తలంపులు వస్తాయి. తలంపులు వచ్చి వెళ్ళిపోతుంటాయి. ఆ తలంపులతో నీదేహాన్ని కనెక్టు చేయకూడదు. థాట్సు వస్తుంటాయి, పోతుంటాయి. ఈ థాట్సును దేహము అనుసరిస్తే నెగిటివ్, పాజిటివ్ చేరినట్లుగా అది క్రియారూపము ధరిస్తుంది.

sri sathyasaivachanamrutam

**వర్తమానమును అతి పవిత్రముగా ఉపయోగపెట్టాలి; ఇదే ప్రధానమైన సాధన**

విద్యార్థులారా! ఏతలంపులు వచ్చినప్పటికిని దానికి ఒక టైమ్ యివ్వండి. థాట్సు వచ్చిన తక్షణమే action లో పెట్టకండి, టైము తీసుకొని Is it good or bad, అని విచారణ చేయండి. అప్పుడు thoughts చల్లబడిపోతాయి. మనకు ఏ thoughts వచ్చినప్పటికి మంచిగాని, చెడ్డగాని వాటిని మనము క్రియారూపములో పెట్టరాదు. కానీ, యీ వయస్సులో రక్తం వేడిగా ఉంటుంది. ఈ వేడిరక్తము మనలను మరింత ప్రోద్బలము గావిస్తుంది. ఈ మనస్సు చెప్పినట్టు వినేటువంటిది కాదు. మనస్సుయొక్క తత్త్వము యెప్పుడూ చంచలత్వమే!

**మనసొకచో నిలువదాయె ఏమి పాపమో**
**మర్కటమై తిరుగసాగె ఏమి శాపమో**
**ఇది నాది అది నాదను తాపత్రయ మెక్కువాయె**
**నిలకడన్నదే లేక నిధిపైనే మనసాయె**
**మనసొకచో నిలువదాయె ఏమి పాపమో**
**మర్కటమై తిరుగసాగె ఏమిశాపమో**

పాపములుగాని, శాపములుగాని ప్రార్థనలతో అన్నీ నిర్మూలమవుతాయి. మనము సుగంధముతోకూడిన భావాలను భగవంతునకు అర్పితము చేయాలి. హృదయాన్ని పుష్పముగా చేసుకోవాలి.

**మల్లెపూవులాంటి మనసు**
**నీ పదముల కర్పితము**
**కలకాదు నిజము**
**జీవితమె సమర్పితము**
**మల్లెపూవులాంటి మనసు**
**నీ పదముల కర్పితము**

ఇలాంటి ప్రార్థనలతో హృదయమును పవిత్రము గావించుకున్నప్పుడే యీ దివ్యత్వము, పవిత్రము యేకమై మానవత్వమన్నది మారి దైవత్వముగా రూపొందుతుంది. మన జీవితములో తెలిసో

తెలియకో అనేక పొరపాట్లు చేస్తూ ఉంటాం. మనము దానినంతా మరచిపోవాలి. Past is past, forget the past. Future is not sure, do not brood over future. Live in the present. వర్తమానమును మనము ordinary present గా కాకుండా omnipresent గా చూసుకోవాలి. Past results present లో ఉంటున్నాయి. Future results కూడా present లో ఉంటున్నాయి. ముందేమి చేశామో దాని result యిప్పుడు ఉంటున్నది. ఇప్పుడేమి చేస్తామో అదే భవిష్యత్తులో ఫలితము వస్తుంది. కనుక మనము presentను అతి పవిత్రముగా ఉపయోగపెట్టాలి. ఇదే విద్యార్థులు చేయవలసిన ప్రధానమైన సాధన.

**విత్తచోరులనుండి చిత్తచోరులుగా మారండి!**

మీ చిత్తమును భగవంతునకు అర్పితము గావించి రసగోత్రా చెప్పినట్టుగా సరెండర్, అనగా శరణాగత తత్త్వాన్ని పెంపొందించుకోవాలి. ఇది చాలా సులభమైనది. సునాయాసమైనది. మీరు surrender చాలా కష్టమని భావిస్తున్నారు. అది మీ భావములో కష్టముగాని, నిజానికి చాలాసులభమైనది. డబ్బుతో కూడిన పర్సు నీ చేతిలో ఉండినంతవరకు నీకు భయమే, భయమే! ఆ డబ్బు నీవు బ్యాంకులో పెడితే భయము ఉండదు. ఎంతసులభము! దగ్గర పెట్టుకున్నంతవరకు నీకు భయమే, ప్రమాదమే! కనుక భగవంతుని grace అనే బ్యాంకులో దీనిని deposit చేయి. నీకు భారము తగ్గుతుంది. భయము పోతుంది. ప్రమాదము ఏమాత్రము ఉండదు. సుఖమైన దానిని వదలిపెట్టి కష్టమైన దానిలో నీవు ప్రవేశిస్తున్నావు. భగవంతునికి అర్పించుట అన్నది చాలా సులభమైన మార్గము. కానీ, దీనికి ఒకటి అడ్డుతగులు తున్నది. ఏమిటది? అహంకారము, 'అయ్యో యిది నాయిల్లే, నా డబ్బే' అని బ్యాంకులో పెట్టటానికి భయపడుతున్నావు. నీవు 'నాది, నాది', అని చెప్పనవసరము లేదు. అది నీదే! భద్రము మాత్రం బ్యాంకువారిది. నీవు cheque లో sign చేస్తే వారు నీకు డబ్బుయిస్తారు. ఎప్పుడైనా నీవు తీసుకొనవచ్చు. ఈ రహస్యము తెలుసుకొనక పోవటంవలన భగవంతునికి అర్పించటము కష్టమైపోతున్నది.

భగవంతునికి చిత్తము అర్పితము చేసుకుంటే నీయొక్క విత్తమంతా నీతోనే ఉంటుంది. ఏనాటికైనా నీవు అది అతనికి అర్పితము చేయక తప్పదు. నీవు యివ్వకపోతే సమయాన్ని పురస్కరించుకొని తానే తీసుకుపోతాడు. కనుక, నీవు తెలిసి భగవంతునికి అర్పితము చేయి.

sri sathyasai vachanamrutam

అప్పుడు నీకు తృప్తి, భగవంతునకు అనుగ్రహము కలుగుతుంది. భగవంతుడు ఎప్పుడూ చిత్తచోరుడే, విత్తచోరుడు కాదు. విత్తచోరులు మీరే! విత్తచోరులనుండి చిత్త చోరులుగా మారండి!

**(తేదీ. 17-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam